మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

సదాశివనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ జడ్పీటీసీ పడగల రాజేశ్వర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్, సాయాగౌడ్‌తో కలిసి మండలంలో మొక్కజొన్న ఆరబోసిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ ప్రభావం వల్ల మొక్కజొన్న పంట తడిసి రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆరిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర రూ.2400 ఉండగా.. దళారులకు రూ.1800లకే విక్రయించి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణానికి హాని కలిగించే వాటిపై అప్రమత్తంగా ఉండాలి

▸ డీఈవో రాజు

కామారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని డీఈవో రాజు తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్కే కళాశాలలో ఈవేస్ట్ మెన్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా హరిథన్ హ్యాక్తన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ టెక్నాలజీ సంబంధిత వ్యర్థపదార్థాలను ఎలా తగ్గించాలనే దానిపై, అనార్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ కళాశాలల నుంచి విద్యార్థుల సెమినార్స్ పీపీటీ, పేపర్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రైజ్‌మనీతో పాటు మెమొంటో, మెడల్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, అపర్ణ, ప్రొఫెసర్ లలిత, వినోద్, డీన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీలపై ఫోకస్

- ఉద్యోగాలు లేకున్నా వేతనాలు డ్రా చేస్తున్న పలు ఏజెన్సీలు
- బోగస్ ఉద్యోగుల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి
- ప్రతీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి యూనిక్ నెంబరు కేటాయింపు
- ప్రతీ ఉద్యోగి ఆధార్‌తో అనుసంధానం కావాలి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు అక్రమాలకు అడ్డాగా మారినట్లు గత కొన్నేళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఏజెన్సీల పని తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో అన్ని జిల్లా పరిధిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ఆధారంగానే వేతనాలను చెల్లించేలా కసరత్తు ప్రారంభించింది. ఈ ప్రక్రియను జిల్లాలో సైతం అమలు చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో లేని ఉద్యోగుల పేరిట జీతాలను తీసుకుంటున్న ఏజెన్సీ నిర్వాహకులకు గుబులు మొదలైంది.

జిల్లాలో 40 ఏజెన్సీలు.. 900లకు పైగా ఉద్యోగులు

కామారెడ్డి జిల్లాలో ఉపాధి కల్పన శాఖలో ఇటీవల టెండర్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉపాధి కల్పన అధికారి కన్వీనర్‌గా ఉండి అర్హత, సీనియార్టీ ఉన్న ఏజెన్సీల పేర్లను ఆయా శాఖలకు సిఫారస్ చేశారు. పలు ఏజెన్సీలు పాల్గొనగా 40 ఏజెన్సీలకు కేటాయింపులు చేశారు. ఈ ఏజెన్సీల పరిధిలో దాదాపు 900ల ఉద్యోగులు పని చేస్తున్నారు. ఎంపిక చేసిన సిబ్బంది హాజరు సహ వేతనాలు చెల్లింపు వంటి అంశాలను ఆయా శాఖల ఉన్నతాధికారులే చూసుకుంటారు. నిజానికి ప్రభుత్వ శాఖల్లో ఏ ఉద్యోగాన్ని భర్తీ చేసినా పేపర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల విద్యార్హత, స్థానికత, వయస్సు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ గతంలో పలు ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారీతిన తమకు నచ్చిన వారిని, ముడుపులు ఇచ్చిన వారిని ఉద్యోగాల్లో భర్తీ చేశారనే ఆరోపణలు లేకపోలేదు. అదేవిధంగా ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోయినా మూడు నెలల వరకు ఉద్యోగుల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి ఏజెన్సీలే చెల్లించాల్సి ఉంటుంది. కానీ మెజార్టీ ఏజెన్సీలు ఈ నిబంధనలు పాటించడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదనే సాకుతో వేతనాల చెల్లింపును వాయిదా వేస్తున్నాయి. ప్రశ్నించిన ఉద్యో

(మిగతా 8లో..)



మూడు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద

▸ మూడు గేట్ల ద్వారా మంజీరాకు నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. వచ్చిన నీటిని వీఆర్ నెంబర్ 4, 5, 20 వరద గేట్ల ద్వారా మూడు గేట్ల ద్వారా నీటి పారుదల శాఖ అధికారులు మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టుకు 28వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిని నిల్వ ఉంచి మూడు గేట్ల ద్వారా వీఆర్ నెంబర్ 4,5,10 వరద గేట్ల ద్వారా 28వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో 73 రోజులుగా ప్రాజెక్టులోని వరద గేట్ల ద్వారా నీటిని విడుదల కొనసాగుతునే ఉంది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

▸ కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత రాజంపేటలోని పారిశుధ్య కార్యక్రమాలను, సరంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీటి పారుదల, చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత వంటి అంశాలను పరిశీలించి అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా నీటి నిల్వలు లేకుండా చూడాలని, చెత్తను సమయానికి తరలించడంతో పాటు శానిటేషన్ వర్కర్లు పర్యవేక్షణలో ఉండేలా చూడాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పారిశుధ్యం అత్యంత ప్రాధాన్యత కలిగినందున అధికారులు, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మదన్‌మోహన్, హౌజింగ్ పీడీ జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

డీఐపీసీ సమావేశం

కలెక్టరేట్‌లో గురువారం డీఐపీసీ సమావేశాన్ని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీజీ ఐపాస్‌లో మొత్తం 1511 దరఖాస్తులు రాగా 1462 పరిశీలించి ఆమోదం తెలిపామన్నారు. టీప్రైడ్ స్కీమ్ ఎస్‌సీపీ కింద ఎజెండా అంశాలను చర్చించామని తెలిపారు. మంజూరైన పెట్టుబడి రాయితీ రూ.8,93,203, టీఎస్‌పీ 4 మంజూరైన దరఖాస్తులు పెట్టుబడి సబ్సిడీ మొత్తం రూ.13లక్షల 20 వేల 872 మంజూరు చేయబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ లాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్.. డబ్బు..

- పుట్ట గొడుగుల్లా రోగ నిర్ధారణ కేంద్రాలు
- అనుమతి లేకుండా పుట్టుకొస్తున్న వైనం
- యథేచ్ఛగా రోగులకు పరీక్షలు
- వైద్య పరీక్షల రిపోర్టుల శాస్త్రీయతపై అనుమానాలు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎవరికైనా జబ్బు చేస్తే నయం చేసుకునేందుకు వైద్యుల వద్దకు వెళతారు. డాక్టర్లు రోగికి సంబంధించిన సమస్యలు తెలుసుకుని వ్యాధి నిర్ధారణకు రోగ నిర్ధారణ కేంద్రాలకు(ల్యాబ్) పంపుతారు. డాక్టర్ సూచనల ప్రకారం ల్యాబ్ నిర్వాహకులు రోగి నుంచి నమూనాలు సేకరించి రిపోర్టులను అందజేస్తారు. అయితే రోగ నిర్ధారణ కేంద్రాలు ఇచ్చే రిపోర్టులు ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం లేదు. దీంతో రోగికి వ్యాధి నిర్ధారణ సరిగ్గా జరగడం లేదు. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. నాసిరకం రసాయనాలు, పరికరాలతో ఉండీ లేని నైపుణ్యంతో తప్పుడు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వీటితో బాధితులకు సరైన వైద్యం అందడం లేదు.

అనుమతులు కొన్నింటికే..

జిల్లా వ్యాప్తంగా సుమారు 100కు పైగా రోగ నిర్ధారణ కేంద్రాలు(ల్యాబ్) ఉన్నాయి. అయితే ఇందులో సగం వాటికి వైద్యశాఖ అనుమతి ఉంటే మిగతా సగం డయాగ్నోస్టిక్ సెంటర్లకు అనుమతులు లేవు. జిల్లా కేంద్రంతో పాటు దోమకొండ, పిట్లం, నిజాంసాగర్, పెద్ద కొడప్‌గల్, బిచ్కుంద, గాంధారి, తాడ్వాయి, జుక్కల్, (మిగతా 8లో..)

నిబంధనలు పాటించకుంటే చర్యలు

▸ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి

జిల్లా పరిధిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఏడు ల్యాబ్‌లను గుర్తించాం. ఈ ల్యాబ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఐదుగురు ల్యాబ్ నిర్వాహకులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరో ఇద్దరికి రెండో సారి షోకాజ్ నోటీస్‌లు అందజేస్తాం. అనుమతి లేకుండా జిల్లాలో ఎవరైనా ల్యాబ్‌లు నిర్వహణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని ల్యాబ్‌లను సీజ్ చేస్తాం.



డిగ్రీ కళాశాల ముందు నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కళాశాలల బంద్ విజయవంతం

కామారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల బందుకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కళాశాలలు సంపూర్ణ మద్దతు ప్రకటించగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బంద్ చేయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌పిష్‌లను విడుదల చేయమంటే ప్రైవేటు యాజమాన్యాలను విజిలెన్స్ ద్వారా దాడులు చేయిస్తుందని అన్నారు. విద్యార్థులపై కపట ప్రేమ చూపిస్తూ చివరకు మొండి చేయి చూపాలని ఆలోచన చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను విస్మరించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం విద్యార్థులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తుందన్నారు. వెంటనే రూ.8వేల కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాహుల్, మణికంఠ, నవీన్, నితీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మొలకెత్తిన నష్టం

- మొంథా తుఫాన్‌తో తడిసిన ధాన్యంతో ఆందోళన చెందుతున్న రైతులు
- కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్న రైతులు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నాగిరెడ్డిపేట మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం తడిసి ముద్దవ్వడంతో, తడిసిన వరి ధాన్యానికి మొలకలు వచ్చాయి. ధాన్యం తడిసి మొలకలు వస్తుండ డంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావం వల్ల మండలంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, వరి ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పినా, అడుగు భాగంలో వర్షపు నీరు చేరి ధాన్యానికి మొలకలొచ్చాయి. మొలకలొచ్చిన ధాన్యానికి వేరు చేసి మిగతా ధాన్యాన్ని శుభ్రం చేసి రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్, పోచారం గ్రామాల్లో తడిసిన ధాన్యానికి మొలకలు వచ్చాయి. గోపాల్‌పేట్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించగా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిందని, ధాన్యం తడవడంతో మొలకలొచ్చాయని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన రైతు తిమ్మాయిపల్లి భూమయ్య, వాడి గ్రామానికి చెందిన గున్కుల అశోక్‌లు తెలిపారు. పోచారం గ్రామంలోని పలువురు రైతుల ధాన్యం తడిసిన కారణంగా వరి ధాన్యానికి మొలకలు వచ్చినట్టు రైతులు తెలిపారు. ఆరుగాలం కష్టపడి వరి పంటను పండించి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి ధాన్యాన్ని ఆరబెట్టి తూకం వేద్దామన్న క్రమంలో తుఫాన్ కారణంగా వర్షం కురవడంతో ఎండిన ధాన్యం వర్షానికి తడిసిందని, తడిసిన ధాన్యానికి మొలకలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. తుఫాన్‌తో నష్టం (మిగతా 8లో..)



భిక్కనూరులో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న భక్తులు

ఓం ప్రకాష్ గుజ్జార్ స్వామి పాదయాత్రకు ఘన స్వాగతం

భిక్కనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి రాజస్థాన్‌కు పాదయాత్రగా వెళ్తున్న ఓం ప్రకాష్ గుజ్జార్ స్వామిజీ పాదయాత్రకు భిక్కనూరు మండల కేంద్రంలో రాజస్థానీలు, భక్తులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు లాల్‌పూరి, ప్రకాష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న దేవుని నారాయణ గుడి ప్రధాన పూజారి ఓం ప్రకాష్ గుజ్జార్ స్వామి రాజాస్థాన్‌లో దేవుని నారాయణ ప్రధాన గుడికి పాదయాత్రగా వెళ్తున్నారని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఈ పాదయాత్రను స్వామిజీ నిర్వహిస్తారని అన్నారు. ఈ నెల 27న ప్రారంభమైన పాదయాత్ర డిసెంబరు 26 వరకు రాజస్థాన్‌కు చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్న ప్రేమకు.. బిడ్డపెట్టే రక్త సంతకం

- కనిపించిన వారిపై కనికరం లేక కాటికి
- జిల్లాలో చోటు చేసుకుంటున్న సంఘటనలు

7

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో బాల్కొండ మండలం బోదెపల్లికి చెందిన సుధాకర్ (40)ను గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతుడు బోదెపల్లిలోని టీవీఎస్ ఎక్సెల్‌పై ఆర్మూర్‌కు వస్తుండగా జాతీయ రహదారి 44పై పెర్కిట్ శివారులో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించినట్లు చెప్పారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకొని మహిళ బలవన్మరణం

భిక్కనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లో గొడవల కారణంగా మనస్తాపం చెంది ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్ష్మీనగర్‌తండాలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లంబాడి శోభ(57)కు కొంతకాలం నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఇంట్లో జరుగుతున్న గొడవలను మనుసులో పెట్టుకుని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నారు. ఆమె కొడుకు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆలయం వద్ద యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రవాయి మైసమ్మ ఆలయం వద్ద గురువారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన అన్వేష్‌రెడ్డి(30) 5 నెలల క్రితం మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ గ్రామానికి ఇల్లరికం వెళ్లాడు. గురువారం ఉదయం ఉగ్రవాయి కట్ట మైసమ్మ ఆలయం వద్ద రేకుల షెడ్డులో అన్వేష్‌రెడ్డి ఉరేసుకున్నాడు. అన్వేష్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్న స్థలంలో సూసైడ్ నోట్ లభించింది. అందులో అత్తమామలు వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు పేర్కొన్నాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మెండోర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో వెల్గటూర్, బట్టపూర్ గ్రామాల మధ్య పెద్ద వాగు వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ సుహాసిని తెలిపారు. మృతుడు తెల్లటి ప్యాంట్, షర్ట్ ధరించాడని, మెడలో నీలిరంగు కండువా వేసుకున్నాడని, కుడి చేతికి పచ్చబొట్టు, కుడి చేతికి రాగి ఉంగరం ఉందన్నారు. మృతుడికి సుమారు 65 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన 8712659864, 8712659859 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాన్సువాడలో ఒకరి అదృశ్యం

బాన్సువాడటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ తుల శ్రీధర్ కథనం ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన నీరుడి సాయిలు ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి చేరుకోలేదు. సాయిలు ఆచూకీ గురించి చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన గోధుమ రంగు షర్టు, కాఫీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

దొంగతనం కేసులో 6 నెలల జైలు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మాల్తుమ్మెదలో ఓ ఇంట్లో దొంగతనం చేసిన నిందితుడికి 6 నెలల జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. 2020 సెప్టెంబరు 22న సిద్దగారి పర్వయ్య తన భూమి అమ్మిన రూ.1.40 లక్షల నగదును ఇంట్లో బీరువాలో పెట్టి తన కుటుంబంతో సహా అత్తారింటి వెళ్లాడు. రెండు రోజుల తర్వాత తిరిగి ఇంటికి రాగా ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి 25న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టగా.. పాత నేరస్థుడైన పట్నం సాయిలు దొంగతనం చేసినట్లుగా గుర్తించారు. సాక్ష్యాధారాలతో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా ఎల్లారెడ్డి న్యాయమూర్తి సుష్మ జైలు శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి..

సుభాష్ నగర్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష, 12 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. గురువారం కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా.. 12 మందికి రూ.18500 జరిమానా, ముగ్గురికి 2రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

మట్కా నిర్వాహకులకు..

బోధన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ఇంతియాజ్, మినాజ్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. గురువారం కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానాతో పాటు 2 రోజుల పాటు జైలు శిక్ష విధించారని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

పాఠశాలకు టేబుళ్ల అందజేత

జక్రాన్‌పల్లి , అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం దాత, పదోన్నతిపై కమ్మర్‌పల్లికి వెళ్ళిన ఉపాధ్యాయుడు జెస్సు సంజీవ్‌కుమార్ టేబుల్‌లను వితరణ చేశారు. 15000 రూపాయలు విలువ గల 5 టేబుల్‌లను ప్రధానోపాధ్యాయుడు లచ్చన్నకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జెస్సు వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కోటగిరిలో బస్సులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ



బోధన్‌లో తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కోటగిరి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని కోటగిరి ఎస్‌ఐ సునీల్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను గురువారం ఎస్‌ఐ తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. స్కూల్ పిల్లల్ని తీసుకువచ్చి, తీసుకెళ్లే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమానులకు సూచించారు. నిబంధనలు పాటించకపోతే పెద్ద ఎత్తున జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బోధన్: ప్రభుత్వ ఆర్‌టీఐ నిబంధనలను ప్రైవేటు ట్రావెల్స్, ప్రైవేటు స్కూల్ బస్సులు తప్పకుండా పాటించాలని బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. గురువారం పట్టణంలో వాహనాల తనిఖీని చేపట్టారు. ప్రైవేటు బస్సులతో పాటు ట్రావెల్స్‌లను సైతం తనిఖీ చేశారు. కర్నూలు జిల్లాలో బస్సు దగ్ధమైన ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. నిబంధనలు పాటించని ట్రావెల్స్ స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గురువారం చేపట్టిన తనిఖీల్లో ఓ స్కూల్ బస్సుపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.


ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేస్తున్న పరీక్షల నియంత్రణ అధికారి సీతయ్య

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ముప్కాల్ , అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా ఎగ్జామినేషన్ బోర్డ్ అధికారి సీతయ్య సూచించారు. గురువారం బాల్కొండ, కిసాన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎస్ఏ 1 పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన విద్యను అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలుకృష్ణవేణి పాల్గొన్నారు.


వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

శాస్త్రవేత్తల పర్యటన

ఏర్గట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచందలో గురువారం నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ చెరుకు, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. గ్రామానికి చెందిన రైతు కొరిపెల్లి లింగారెడ్డికి సంబంధించిన పొలంలో సాగు చేస్తున్న ఆర్‌డీఆర్ 1200 రకం వరి క్షేత్రాన్ని సందర్శించి రైతుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాకేష్, కృష్ణ చైతన్య, రమేష్, ఏవో వైష్ణవ్, సాయిసచిన్, రైతులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూ చేస్తున్న పుర కమిషనర్ రాజు

పునరావాస పథకానికి ఇంటర్వ్యూలు

ఆర్మూర్ టౌన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో దివ్యాంగుల ఆర్థిక పునరావాస పథకాన్ని అమలు చేయడానికి పుర కమిషనర్ రాజు దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మునిసిపల్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 101 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 64 మంది దివ్యాంగులు ముఖాముఖికి హాజరయ్యారు. మునిసిపల్ కమిషనర్ రాజు వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. నిబంధనలను అనుసరించి మంజూరైన యూనిట్లను అర్హులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునంద, మెప్మా టీఎంసీ ఉదయ శ్రీ, సీవో రాజలింగం, తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణ మహిళా సమాఖ్య సభ్యులు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని మునిసిపల్ సమావేశ మందిరంలో మహిళా సమాఖ్య మహాజన సభను నిర్వహించారు. సంఘాల్లో లేని మహిళలను చేర్పించి బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. అనంతరం మెప్మా డీఎంసీ మాధురిలత మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ వారితో పెట్రోల్‌బంక్‌లు, మహిళా శక్తి క్యాంటీన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మొదలైన వాటిని ఏర్పాటుచేయిస్తోందన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాందాస్, మేనేజర్ వరలక్ష్మి, మెప్మా సమన్వయకర్త శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఏ.శ్రీనివాస్, వీ.శ్రీనివాస్, జ్యోతి, సురేఖ, సమాఖ్య అధ్యక్షురాలు రఫియా సుల్తానా, స్వరూప, సుజాత, లలిత, రిసోర్స్ పర్సర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ

పంటనష్టంపై నివేదిక అందించాలి

ఆర్మూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మగ్గిడిలో భారీ వర్షాలకు నీటమునిగిన, నేలకొరిగిన వరి, ఇతర పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేకల గోవింద్ గురువారం పరిశీలించారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వరి పంట నీట మునిగినట్లు గుర్తించారు. నష్టపోయిన పంటల వివరాలను అంచనా వేసి తమకు నివేదిక సమర్పించాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారులను ఆయన ఆదేశించారు. పంటలు నీట మునిగిన సమయంలో పొలాల నుంచి నీరు పూర్తిగా తీసివేయాలని డీఏవో సూచించారు. తెగుళ్లు సోకకుండా, తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, ఏఈవోలు, రైతులు ఉన్నారు.


దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్


ఎన్‌సీసీ క్యాడెట్‌లతో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ

ఎన్‌సీసీని ఉపయోగించుకోవాలి

ఎడపల్లి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీని సరైన వేదికగా ఉపయోగించుకుని సాయుధదళాలలో, జీవితంలో ఉన్నత స్థాయిలో ఎదగాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఏపీ తెలంగాణ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. గురువారం మండలంలోని జానకంపేట శివారులోని కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. యువకులంతా 2047 కల్లా దేశాన్ని అభివృద్ధి పథంలో ఉంచి, ఎన్‌సీసీ క్యాడెట్స్‌గా తమవంతు బాధ్యతను నిర్వహించి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్నారు. నవంబరు 7 వరకు శిక్షణ కొనసాగుతుందని ఇందులో నేర్చుకున్న విషయాలను పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో అఫిషియేటింగ్ గ్రూపు కమాండర్ కల్నల్ కపూర్, క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియజిత్‌సుర్, అడామ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ విష్ణు ప్రసాద్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

▸▸ నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సుభాష్ నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి)ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతు తీవ్రంగా నష్టపోయాడన్నారు. రంగు మారిన ధాన్యాన్ని మొలకెత్తిన ధాన్యాన్ని ఎలాంటి కష్టా లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మద్దతు ధరతో పాటు బోనస్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.


భీమ్‌గల్ మండలంలో పర్యటించిన అధికారుల బృందం

రాష్ట్ర ఆడిట్ బృందం పర్యటన

భీమ్‌గల్ రూరల్ , అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగిర్యాల్, బాబానగర్, పిప్రి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను గురువారం రిస్క్ బేస్డ్ ఇంటర్నల్ రాష్ట్ర ఆడిట్ అధికారులు సందర్శించారు. పిప్రిలోని నీటి నిలువ కందకాల పనులను, ప్లాంటేషన్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, బాబాగనర్‌లో కమ్యూనిటీ హాల్‌లు, ఇంకుడు గుంతలు, సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉపాధిహామీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ బృందం అధికారులు సాధన, స్మిత, జిల్లా అధికారులు అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి ఓం పాల్, జిల్లా అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీవో జావిద్ అలీ, ఏపీవో నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో సకల శుభాలు

బోధన్,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి గోవిందా నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు అన్నారు. గురువారం కార్తీక మాస మాస కల్యాణం సందర్భంగా కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీవేంకటేశ్వరుడి జన్మ నక్షత్ర వేడుకలు

ఏర్గట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి అలంకరణ, అభిషేకం, హోమం నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.


ఏర్గట్లలో పూజలు నిర్వహిస్తున్న వీడీసీ సభ్యులు

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

ఎడపల్లి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): జానకంపేటలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. కొనుగోలుకేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం 17 కన్నా తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ దత్తాత్రి, పీఏసీఎస్ చైర్మన్ మల్కారెడ్డి, ఏపీఎం రాజేందర్ తదితరులున్నారు.


జానకంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రిటైర్డ్ ఆర్టీవోకు సన్మానం

వేల్పూర్ , అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆర్టీవోగా ఉద్యోగ విరమణ చేసిన లక్కోర గ్రామానికి చెందిన సుభాష్‌ను గురువారం మోతె గ్రామ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. విద్యార్థులందరూ సుభాష్‌లా కష్టపడి చదువుతూ ఉన్నత ఉద్యోగాలు సాధించడానికి కృషి చేయాలని పీఆర్‌టీయూ మండల కార్యదర్శి నర్సింహారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హెచ్‌ఎం లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ ఉపాధ్యాయులు అనిష్, రమేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సుభాష్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఆత్మ గౌరవ సభ విజయవంతం చేయాలి

కోటగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దళితుల ఆత్మ గౌరవ సభ నవంబరు 1వ తేదీన హైదరాబాద్‌లో జరగనుందని, ఈ సభను దళితులంతా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పోచీరాం కోరారు. పోతంగల్ మండల కేంద్రంలో గురువారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గావాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు. మానవ హక్కుల సంఘం ఈ విషయంపై స్పందించకపోవడం ప్రజాస్వామ్యానికి అత్యంత బాధకరమని ఆయన పేర్కొన్నారు. దళితుల ఆత్మ గౌరవ ప్రదర్శనకు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లో జరిగే ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సాయిలు, భూమయ్య, పోచయ్య, శ్రీను, సంజీవ్, గంగాధర్, ఎల్లప్ప, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పోచీరాం

ఎస్సారెస్పీలోకి భారీ వరద

▸▸ లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. లక్ష అవుట్ ఫ్లో ▸▸ 26 వరద గేట్ల ద్వారా నీటి విడుదల

మెండోర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి లక్ష 9వేల 654 క్యూసెక్కుల వరద చేరుతుండటంతో వచ్చింది వచ్చినట్లుగా వరద గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ జగదీష్ తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి భారగా వరద రావడంతో గురువారం ఉదయం 26 వరద గేట్లను ఎత్తి నీటికని దిగువవకు వదిలారు. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరింది. ఎస్కేప్ గేట్ల ద్వారా 8,000, సరస్వతి కాలువకు 650, ఆవిరి రూపంలో 573, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 80టీఎంసీల నీటినిల్వ ఉంది. జూన్ 1 నుంచి ప్రాజెక్టులోకి 898 టీఎంసీల వరద చేరగా ప్రాజెక్టు వరద గేట్లు, ప్రధాన కాలువల ద్వారా 832 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు.


గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల అవుతున్న వరద

రాష్ట్రస్థాయి పోటీలకు అమ్రాద్ విద్యార్థులు

మాక్లూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్రాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సురేష్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థులు సాత్విక, కృష్ణ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన పీడీ అనురాధను ఆయన అభినందించారు. వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఎంపికైనవారు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

కోటగిరి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధరను అందించేందుకు ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు సూచించారు. పోతంగల్ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల తహసీల్దార్ గంగాధర్, సహకార సంఘం అడ్మినిస్ట్రేటర్ రియాజుద్దీన్, నాయకులు హంగర్గ గంగాధర్, దిలీప్ కుమార్, హన్మంత్ రావు, మాధవ రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీవో విష్ణు సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో విష్ణు పరిశీలించారు. అకాల వర్షాలు దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం యాద్గార్‌పూర్, వల్లభాపూర్ గ్రామాలోల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం భాస్కర్, సీసీ సాయిబాబా, కార్యదర్శులు తదితరులున్నారు.

విముక్త సంచారులు.. పోరాటయోధులు

రెంజల్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): విముక్త సంచార జాతుల ప్రజలు స్వాతంత్ర పోరాటంలో ఆంగ్లేయులతో పోరాడిన యోధులని ఏబీడీఎన్‌డీ సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ బికురాంజీ ఇదాతే అన్నారు. గురువారం మండలంలోని కందకుర్తిలో సంచార జాతుల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మలవారు, దాసరులు, చిందుల, కైకడి, సిక్లిఘర్, వీరభద్రియ, ముండిబండ, ఊడక జంగం, ఓడ్ తదితర సంచార జాతుల కులాల ప్రజలు తమ కులస్థులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంచార జాతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పోరాటాలతోనే పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏబీడీఎస్‌పీ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ పహాడ్, చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, జాదవ్ శరత్, రమేష్, ఆయా సంచార జాతి కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలలకు అనుమతి

ఆలూర్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మిర్ధాపల్లి ప్రాథమిక పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలను (యూకేజీ) ప్రారంభించనున్నట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, ఒక ఆయాను నియమించనున్నారు. ఉపాధ్యాయ నియామకానికి ఇంటర్మీడియట్‌తో పాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ పూర్తి చేసి ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారని తెలిపారు. నవంబరు 1లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్

పిట్లం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పిట్లం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు తహసీల్దార్ రాజా నరేందర్ గౌడ్ బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి కొరకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హనుమాండ్లు, నాయకులు అశోక్, మోయిన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

పిట్లం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలు అందజేసి, లబ్ధిదారులతో భూమి పూజ చేయించి పనులు ప్రారంభించడం జరుగుతుందని ఎంపీవో నాగరాజు అన్నారు. మండలకేంద్రంలో పలువురి ఇళ్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు ప్రభుత్వం నుంచి సకాలంలో మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారుల పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమాండ్లు, నాయకులు అశోక్, మోయిన్, అద్వాన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తనిఖీలు



పాఠశాలలో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంఈవో దేవీసింగ్

పిట్లం , అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పిట్లం మండలంలోని గద్దగుండ తండాలో గల ప్రభుత్వ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి దేవిసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లు విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు అశోక్, సీఆర్‌పీ హైమద్ పాషా పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి స్థలం కేటాయించాలి



బీర్కూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో బీరప్ప మందిర నిర్మాణానికి స్థలం కేటాయించాలని శ్రీ మల్లన్న గొర్రెల, మేకల సహకార సంఘం సభ్యులు గురువారం తహసీల్దార్ సాయి భుజంగ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి 3కి.మీ దూరంలో పంట పొలాలలో బీరప్ప మందిరం ఉందని, రోడ్డు మార్గం లేక ఇబ్బందిగా ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నూతన మందిర నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శివకేశవులకు అభిషేక పూజలు



విఠలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బీర్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శ్రావణ నక్షత్రం సందర్భంగా గురువారం బీర్కూర్ విఠలేశ్వర ఆలయంలో శివకేశవులకు మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయానికి చేరుకున్నారు. స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీర్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం బీర్కూర్ మండలకేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలన్నారు. అకాల వర్షాలకు రైతులు ధాన్యం కాపాడుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారని అన్నారు. అలాగే ఎలాంటి తరుగు లేకుండా అన్నదాతలకు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు నగదు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జుబేర్, అంజిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వార్డెన్‌కు సూచించారు. గురువారం పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో అందిస్తున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత గురించి ఆరా తీశారు. వంటకాలు సక్రమంగా వండటం లేదని విద్యార్థులు పోచారం దృష్టికి తీసుకవచ్చారు. స్పందించిన ఆయన వంటమనిషిని పిలిపించి హెచ్చరించారు. విద్యార్థులకు సరైన పోషకాహారం అందేలా, నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారం వండాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణగా ఉంటూ చదువుకోవాలన్నారు. విద్యార్థుల సంక్షేమంపై పోచారం చూపించిన శ్రద్ధపై తల్లిదండ్రులు, సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు గురువినయ్, సురేశ్, నాయకులు ఏజాస్, మన్సూర్ తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సీఐ తుల శ్రీధర్

బాన్సువాడటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సమాజంలో పోలీసుల పాత్ర అనే అంశంపై విద్యార్థులు వ్యాసాలు రాశారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యారులకు పట్టణ సీఐ తుల శ్రీధర్ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని ఆ దిశగా చదువుకోవాలని సూచించారు. బాలికల కోసం అనేక చట్టాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్ఆర్ వ్యవస్థాపకుడు సంతోష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కన్నప్రేమకు.. బిడ్డపెట్టే రక్త సంతకం



▸▸ కనిపెంచిన వారిపై కనికరం లేక కాటికి ▸▸ జిల్లాలో చోటు చేసుకుంటున్న సంఘటనలు

> మనిషికి ప్రాణం పోసేది తల్లిదండ్రులు. ఉన్నతంగా వ్యక్తిగా తీర్చిదిద్దేది సమాజం. ఏ ఆధ్యాత్మిక గ్రంథం చూసిన మాతృదేవోభవ అంటూ తల్లి ప్రాధాన్యతను, పితృదేవోభవ అంటూ తండ్రి గొప్పతనాన్ని చాటి చెపుతాయి. నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి, ఆ తర్వాత శిశువు పెరిగి పెద్ద వాడయి ప్రయోజకుడయ్యేంత వరకు తండ్రి పాత్ర గురించి ఎంత చెప్పిన తక్కువే. కానీ నేటి సమాజంలో మనిషి జీవన ఎదుగుదలకు కృషి చేసిన తల్లిదండ్రులు వృద్ధాప్య దశకు చేరుకోగానే వారి పోషణభారమై, వారికి సేవ చేయలేక కడతేర్చుతున్నారు కొందరు కసాయి బిడ్డలు. వృద్ధాప్యంలో తోడుగా ఉండి తమ జీవితానికి అండగా ఉంటున్నాడనుకున్న కొడుకులు వారి పాలిట యముళ్లుగా మారడంతో తనువు చాలిస్తున్నారు ప్రాణదాతలు.

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 30, ఆంధ్రజ్యోతి: ఇటీవల కామారెడ్డి జిల్లాలో జరుగుతున్న సంఘటనలు చూస్తే మాయమైపోతున్నడన్న మనిషన్నవాడు అనే అందెశ్రీ పాట తలంపునకు వస్తుంది. జిల్లాలో గడిచిన మూడు నెలల కాలం నుంచి పరిశీలిస్తే పిట్లం మండలంతో పాటు, బాన్సువాడ మండలంలోని గ్రామాలలో చోటు చేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. కన్నతల్లిదండ్రులు అని చూడకుండా, వారి బాగోగులు దేవుడెరుగు కనీసం వారిని ప్రాణంతో కూడా ఉండనిచ్చే పరిస్థితి లేదంటే సమాజంలో విలువలు ఎంత బలహీనపడ్డాయో అర్థమవుతోంది.

● బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన ఓ తల్లికి సేవ చేయలేక ఆమె పోషణ భారమైందని ఆమె కొడుకు వృద్ధురాలైన తల్లిని ద్విచక్ర వాహనంపై తీసుకవచ్చి బొల్లక్‌పల్లి సమీపంలో గల మంజీరా నదిలో పారవేశారు. మొదట పోలీసులు అనుమానాస్పద కేసు నమోదుచేసి ఆ తర్వాత విచారణ చేయగా విషయం పోలీసుల విచారణలో వెలుగులోకి రావడంతో నేరానికి పాల్పడిన కొడుకు కటకటాల పాలయ్యాడు.

● ఇటీవల గత నాలుగు రోజుల కిందట పిట్లం మండలంలోని గౌరారం తాండలో వృద్ధ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉండగా వారి పోషణలో భాగంగా తండ్రి పెద్ద కుమారుడు దగ్గర, తల్లి చిన్న కుమారుడి దగ్గర వంతుల వారీగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు తండ్రికి సేవలు చేయలేక వృద్ధాప్యంలో ఉన్న తండ్రి భారమై ఏం చేయాలో అని ఆలోచించిన కొడుకు తండ్రిని అంతం చేస్తే తనకు పోషణభారం ఉండదని భావించి కల్లులో విషం కలిపి తండ్రికి తాగించాడు. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో అసలు విషయం వెలుగులోకి రాగానే కొడుకును పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇకనైనా ఆలోచన తీరు మార్చుకొని కన్నవారిని బాగా చూసుకుందాం.

వెలుగులోకి కొన్నే..

కొన్ని ఘటనలే వెలుగులోకి రాగా, వెలుగులోకి రాని ఘటనలు ఎన్ని ఉంటాయో తెలియని పరిస్థితి. ఇలాంటి ఘటనల్లో తల్లిదండ్రుకు సేవ చేయలేక కొందరు నీచానికి పాల్పడుతుంటే, మరి కొందరు ఆర్థికంగా వారి పోషణ భారమై దారుణాలకు పాల్పడుతున్నారు. తమకు జన్మనిచ్చిన వారికి గొప్ప సేవలు చేయకపోయినా.. కనీసం తిండి పెట్టి సాకితేనే పిల్లల జన్మకు సార్థకత ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. తాము కూడ వృద్ధులుగా మారిన తర్వాత పరిస్థితిపై ఆలోచన లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి



వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఇందల్వాయి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఒక విద్యార్థి సంఘానికి కొమ్ముకాస్తున్న తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరిపై చర్యలు తీసుకోవాలని వీసీ యాదగిరిరావుకు ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజిస్ట్రార్ ఒక విద్యార్థి సంఘానికి సంబంధించిన ఇద్దరు విద్యార్థులకు హాస్టల్ ఫీజు తీసుకోకుండానే ఏడాది నుంచి హాస్టల్ వసతి కల్పిస్తున్నారని అన్నారు. విద్యార్థులను పారదర్శకంగా నడిపించాల్సిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ తన దిశగా మలుచుకోవాలని కొంతమంది విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తూ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీసీని కలిసిన వారిలో టీయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు చౌదరిపల్లి మహేష్ కుమార్, ఉపాధ్యక్షుడు గూడూరి అరుణ్ తేజ, ప్రధాన కార్యదర్శి జనార్థన్, కార్యదర్శి నవీన్, సహాయ కార్యదర్శి శివ కుమార్, కార్ల లక్ష్మణ్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ, తదితరులు

కార్యశాల కరపత్రాల ఆవిష్కరణ

ఇందల్వాయి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 6న జరిగే ఐపీఆర్ అంతర్జాల కార్యశాల కరపత్రాలను యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు గురువారం ఆవిష్కరించారు. 'మేధో సంపత్తి హక్కులు, పేటెంట్' అనే అంశంపై జరిగే ఈ కార్యశాలను విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యశాలకు రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్మెంట్‌కు చెందిన అసిస్టెంట్ కంట్రోలర్ డాక్టర్ భరత్ సూర్యవంశీ కీలక ఉపన్యాసం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యాశాల నిర్వాహకులు వృక్షశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హలీం ఖాన్ సమన్వయ కర్తగా వ్యవహరించనున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎం.అరుణ, ఆచార్య బి.విద్యావర్థిని, డాక్టర్ డి.శ్రీనివాస్, డాక్టర్ వి.జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ల పనితీరును, పోలీసు సిబ్బంది నిర్వహించే విధులు, ప్రజలు పొందాల్సిన వివిధ సేవలను, డయల్ 100, షీ టీం, సైబర్ క్రైమ్, ఆయుధాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. పోలీసు సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, నేరాల నివారణ, ప్రజల రక్షణలో పోలీసుల పాత్రపై అవగాహన కల్పించారు. చట్టాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చదువుపైనే ప్రత్యేక దృష్టి సాధించాలని, ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ జయంతి.. నేడు 2కే రన్

మద్నూర్, బాన్సువాడ టౌన్, పెద్దకొడప్‌గల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నేడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మద్నూర్ పోలీస్‌స్టేషన్ నుంచి సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు 2కే రన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీలో అందరూ హాజరు కావాలని కోరారు.

● బాన్సువాడలో అంబేద్కర్ చౌరస్తా నుంచి జయశంకర్ స్టేడియం వరకు శుక్రవారం 9 కి 2కె రన్ ఉంటుందని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు.

● పెద్దకొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలయం నుంచి 8:30కు ఐక్యతా ర్యాలీ ప్రారంభమవుతుందని ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

రూ.8100 కోట్లు విడుదల చేయాలి

ఇందల్వాయి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ యూనివర్సిటీ సంపూర్ణ బంద్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు జీషన్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నటువంటి రూ.8100 కోట్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం విడతల వారీగా దీపావళి లోపు రూ.600 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు రూపాయి కూడా విడుదల చేయకపోవడం దారుణమని ఆయన అన్నారు. ఓ పక్క స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌లు రాక విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలల యాజమాన్యాలను సంప్రదిస్తే ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పి యాజమాన్యాలు చెబుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విద్యార్థుల చదువుల కోసం అప్పుచేసి యాజమాన్యాలకు ఫీజులు కడుతున్న పరిస్థితి జిల్లాలో దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజు రియింబర్స్‌మెంట్లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని యాజమాన్యాలు ప్రశ్నిస్తే విజిలెన్స్ దాడులు జరుపుతున్నారని విమర్శించారు. వెంటనే విద్యార్థుల హక్కు అయినటువంటి స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, లేదంటే తీవ్ర ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు నాగేంద్ర, నిరంజన్, శ్రీనివాస్, మారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సంక్షిప్త సమాచారం

సీజ్ చేసిన పెసర్లకు వేలం

మద్నూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్, సొసైటీ కార్యదర్శి బాబురావు ఆధ్వర్యంలో పెసర్ల వేలం నిర్వహించారు. ఆరేళ్ల క్రితం సీజ్ చేసిన 48 బస్తాల పెసర్లకు వేలం నిర్వహించగా మండలకేంద్రానికి చెందిన రాములు రూ.29 వేలకు 45 బస్తాలు దక్కించుకున్నారు.

3న రేషన్ బియ్యానికి వేలం

మద్నూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలతో రేషన్, అంగన్వాడీ కేంద్రంలోని బియ్యం తడిసిపోవడంతో వాటిని నవంబర్ 3న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మాదన్‌హిప్పర్గా రేషన్ దుకాణం వద్ద 20 క్వింటాళ్లు, లింబూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద 2 క్వింటాళ్ల బియ్యం తడిసి ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

బీర్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనిధి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కిష్టాపూర్ గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీవో మహబూబ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు, గ్రామ పెద్దలు ఉన్నారు.

వాహన తనిఖీలు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పక కలిగిఉండాలన్నారు. లేదంటే జరిమానాతో పాటుగా కేసులు నమోదుచేస్తామని సహాయక రవాణశాఖ అధికారి కృష్ణతేజ అన్నారు. గురువారం మండలంలోని సోమేశ్వర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టి సరైన వాహన ధ్రువపత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు.

చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు

మద్నూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగున్నాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గజానంద్ దేశాయి అన్నారు. కుర్లాలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణానికి అధికారులు మార్కౌట్ వేసి ఇవ్వడంతో భూమి పూజచేశారు. మండలానికి 897 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో 487 నిర్మాణాలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. 343 బేసిమెంట్ లెవల్, 140 రూఫ్‌లెవల్లో ఉన్న ట్లు వెల్లడించారు. 65 ఇళ్ల నిర్మాణం ఇప్పటి కే పూర్తయినట్లు తెలిపారు.

రామారావ్ మహరాజ్‌కు నివాళి

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బంజారాల సమాజ శ్రేయస్సు కోసం ఎనలేని కృషిచేసి వారిని అభివృద్ధి పథంలో నడిపించిన రామారావ్ మహరాజ్ సేవలు వెలకట్టలేనివని మండల గిరిజన నాయకులు పేర్కొన్నారు. గురువారం పెద్ద కొడప్‌గల్‌లో రామారావ్ మహరాజ్ వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్మశాన అభివృద్ధికి విరాళం

బాన్సువాడటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారం కూడా అవసరమని మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. గురువారం బాన్సువాడ దంత వైద్యనిపుణులు జీవన్ తన తండ్రి జ్ఞాపకార్థం దింపుడు కళ్లెం, పూజా మందిరాల పెయింటింగ్ కోసం 100 లీటర్ల పెయింట్‌ను అందజేశారని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

బాధిత వ్యక్తికి పరామర్శ

పిట్లం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు గొల్ల నారాయణ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకున్నారు. విషయం తెలిసిన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే గురువారం పరామర్శించారు.

మొలకెత్తిన నష్టం

(5వ పేజీ తరువాయి)

వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. గురువారం మండలంలో వర్షం కురువకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యానికి తిరిగి రైతులు ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని రైతులు వేరుచేస్తూ మిగతా ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. అధికారులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వెంటనే తూకం వేసి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉపశమనమిచ్చిన మొంథా తుపాన్



ఎండ రావడంతో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం తగ్గిపోవడంతో గురువారం మండలకేంద్రంలో వాతావరణం ఎండగా ఉంది. దీంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడవకుండా కవర్లతో కప్పి ఉంచిన రైతులు ఆ ధాన్యాన్ని ఆరబెట్టారు. ధాన్యం మొత్తం చేతికి అందకుండా పోతుంది అనుకున్న అన్నదాతకు ఎండ కాయడంతో మొంథా తుపాన్ నుంచి కాస్త ఊపిరినిచ్చినట్లయింది.

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై దీపక్ కుమార్

లింగంపేట, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్సై దీపక్‌కుమార్ విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసుల విధులు, బాధ్యతలు, రికార్డుల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వారికి వివరించారు.

సంఘాల నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకన్న

కామారెడ్డిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా క్రెడిట్, మార్కెట్ ఫోకస్, ప్రభుత్వ విధానాలు, నాబార్డు స్కీమ్, ప్రభుత్వ మద్దతు, స్కిల్ ఇండియా డెవలప్‌మెంట్, వ్యాపార లాభాల సంపాదన సముపార్జనలపై అవగాహన కల్పించామని ప్రిన్సిపాల్ వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ప్రెసిడెంట్లు, సహకార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కామారెడ్డి మునిసిపాలిటీలోని 14వ వార్డులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తమ సొంత నిధులతో గురువారం వీధి దీపాలను ఏర్పాటుచేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డులోని ప్రజలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపల్ అధికారులకు పలుమార్లు అభ్యర్థించినా ఎటువంటి చలనం లేదన్నారు. దీంతో తమ సొంతనిధులు రూ.20వేలతో ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గంగారాం, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనం



పదవీ విరమణ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడ్వాయి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేమి కలాన్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ముకుంద గారి రామారావు పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామస్వామి, ఆనందరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మనోహర్ రావు, మండలాధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు పుస్తెమెట్టెల అందజేత



కామారెడ్డిలో పుస్తెమట్టెలను అందజేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ రాజు

కామారెడ్డిరూరల్, దోమకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని ఇస్రోజివాడి గ్రామంలో గురువారం పాల ఉత్పత్తిదారుడు మల్లిగంగయ్య కూతురు వివాహం జరిగింది. ఈ మేరకు కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల డైరీ అసిస్టెంట్ మేనేజర్ జె.రాజు పుస్తెమట్టెలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాకేష్, ప్రెసిడెంట్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

● దోమకొండలో గురువారం జరిగిన మౌనిక- గణేష్‌ల వివాహానికి మాజీ సీడీసీ చైర్మన్ నర్సయ్య పుస్తెమెట్టెలు అందించారు. తన కూతురు ఐరేని జ్ఞాపకార్థం తనకు తోచినంత సాయం చేసినట్లు తెలిపారు.

ఏజెన్సీలపై ఫోకస్

(5వ పేజీ తరువాయి)

గులను ఏదో విధంగా విధుల నుంచి తప్పిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తే ఏదో ఒక్క రోజు రెగ్యులర్ అవుతుందనే ఆశతో అభ్యర్థులు పోటీ పడుతుంటారు. ఈ బలహీనతలనే పలు ఏజెన్సీలు క్యాష్ చేసుకుంటున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఏళ్ల తరబడి పని చేస్తున్న ఉద్యోగాలు పర్మినెంట్ కాకపోవడంతో పలువురు మధ్యలోనే మానేస్తున్నారు. అయినప్పటికీ వారు యదావిధిగా పని చేస్తున్నట్లు బోగస్ రికార్డులు చూపిస్తూ వేతనాలు డ్రా చేస్తున్నారు. ఇందుకు పలు శాఖల అధికారులు కూడా సహకరిస్తున్నట్లు సమాచారం.

ఆధార్‌తో అనుసంధానం కావాల్సిందే..

రాష్ట్రంలో పని చేసే రెగ్యూలర్ ఉద్యోగులకు అన్ని ఆధారాలు వారి సర్వీస్ బుక్‌లో ఉంటాయి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు మాత్రం ఆయా శాఖల పరిధిలో ఉండవు. ఉద్యోగుల వివరాలు ఆయా ఏజెన్సీల వద్దనే ఉంటాయి. ఏజెన్సీలు చూపించే లెక్కల ఆధారంగానే ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. దాన్ని ఆధారంగా చేసుకొని కొన్ని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శాఖల వారీగా మంజూరైన పోస్టుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగులను నియమించకపోయినా నియమించినట్లుగా లెక్కలో చూపించి నిధులను మింగేస్తున్నాయని ప్రభుత్వం గుర్తించింది. దీంతో అన్ని జిల్లాల పరిధిలో ఔట్ సోర్సింగ్ కేటగిరీల కింద ఎంత మంది ఉద్యోగులు ఉన్నారని తేల్చడంతో పాటు వారి వివరాలను ఆధార్‌తో లింక్ చేసి ఆన్‌లైన్ అప్‌డేట్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

పలువురు ఉద్యోగులకు తప్పని తిప్పలు

ప్రస్తుతం ఆయా ఏజెన్సీల పరిధిలో వివిధ శాఖల్లో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు ఆధార్ అనుసంధానంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళ ఉద్యోగుల విషయంలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. పెళ్లి కాకముందే ఆధార్‌లో తల్లి/తండ్రి పేరు ఉండేది. ప్రస్తుతం పెళ్లి కావడంతో బ్యాంక్ ఖాతాలు అత్తింటి వారి పేరు మీద తీస్తున్నారు. ప్రస్తుతం ఆధార్‌తో అనుసంధానం చేస్తే అది ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదని వాపోతున్నారు. పాత ఆధార్‌ను ఇప్పటికిప్పుడు అప్‌డేట్ చేసుకొని మార్పులు చేసుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో తాహేరా బేగం

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో గురువారం అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీడీవో తాహేరా బేగం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటించి వారు నేర్చుకున్న ఆటపాటలను చూసి వారి ప్రతిభను అభినందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలు చాలా చురుగ్గా ఉన్నారని ప్రశంసించారు. పిల్లల ఎదుగుదలకు కావాల్సిన పౌష్టికాహారం అందించాలని, అంగన్‌వాడీ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శి సలీం, కారోబార్ సంగారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ దుర్గా, నాయకులు రామాగౌడ్, గురుప్రతాప్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



పంటను పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ

గాంధారి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలకేంద్రంలో గురువారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని, సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగిల్ విండో కార్యదర్శి సాయిలు, రైతులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలో రైతుల నుంచి మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ పడగల రాజేశ్వర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రమేష్, సాయాగౌడ్‌తో కలిసి మండలంలో మొక్కజొన్న ఆరబోసిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతావరణ ప్రభావం వల్ల మొక్కజొన్నలు తడిసి రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున ఆరిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 ఉండగా కొనుగోలు కేంద్రాలు నిర్వహించకపోవడంతో దళారులకు రూ.1800 లకే విక్రయించి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే మొక్కజొన్నను విక్రయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ పట్టా



పట్టా అందజేస్తున్న యూనివర్సిటీ అధికారులు

రామారెడ్డి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు షకీల్ బుధవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో హిందీలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నట్లు వివరించారు. తన శ్రమకు తగిన ఫలితం లభించిందని చెప్పారు. ఈ విజయాన్ని తన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు ఉపాధ్యాయుడు షకీల్ వివరించారు. తనకు ఉత్తమంగా చదువు నేర్పించిన ఉపాధ్యాయులకు, మిత్రులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని సంతోషం వ్యక్తం చేస్తూ హామీ ఇచ్చారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్యదర్శి రాజు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో జలజీవన్ మహిళా సాధికారత సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసుకున్న 25మంది మహిళలకు గురువారం పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు సర్టిఫికెట్లు అందజేశారు. జలజీవన్ మహిళా సాధికారత వారు గ్రామంలో మహిళలు స్వయం ఉపాధి పొందడానికి నెలరోజుల పాటు శిక్షకురాలిని నియమించి ఉచితంగా కుట్టుమిషన్ నేర్పించడం అభినందనీయమన్నారు. జిల్లా కోఆర్డినేటర్ అంజమ్మ, ట్రైనర్ వరలక్ష్మీ, కారోబర్ కృష్ణమూర్తి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

భిక్కనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన జిట్ట భరత్ వివాహం ప్రణతితో గురువారం జరిగింది. ఈ వివాహానికి కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, వెంకటి, దినేష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన గుండు నాగరాజు కూతురి వివాహం హైదారాబాద్‌లో జరిగింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దఫేదార్ రాజు హాజరై నూతన వధూవరులను ఆశార్వదించారు.



పంటను చూపిస్తున్న రైతు

నాసిరకం విత్తనాలు.. అన్నదాత ఆవేదన

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాలు అంటగట్టి తనను నిండా ముంచారని ఓ అన్నదాత ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్ పంట సాగుకు ముందు ఓ ఫర్టిలైజర్ షాప్‌లో విత్తనాల కొనుగోలుకు వెళ్తే నాసిరకం విత్తనాలు అంటగట్టారని ఆరోపించారు. ఓ కంపెనీకి చెందిన వంగడాలు విక్రయించారని, ఇవి ఎంతో నాణ్యమైనవని సకాలంలో పంట చేతికచ్చి అధిక దిగుబడి వస్తుందని మాయమాటలు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసినప్పటి నుంచి పంట ఎదగలేదని అన్నారు. శివారులో తనతో పాటు వేసిన ఇతర వరి పంటలు చేతికొచ్చాయని, అదే సమయంలో తానువేసిన పంట చేతికి రాకపోవడంతో విచారణ వ్యక్తం చేశారు. అధికారులు ఇటువంటి మోసాలను అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.



కలెక్టర్ దంపతులకు ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు

కంఠేశ్వర ఆలయంలో కలెక్టర్ దంపతుల పూజలు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో నిజామాబాద్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొని అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ కలియతిరిగి ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అర్చకులు, వేదపండితులు కలెక్టర్ దంపతులను వేద మంత్రాలతో ఆశీస్సులు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుహాస్ శాఖాయ్, ఉప అర్చకులు మకరంద్ శాఖాయ్, నీలేష్, శేఖర్, కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్ గుప్త, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సూభాష్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు బిక్షాటన చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వివిధ దుకాణాలలో తిరుగుతూ బిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. గత మూడు 4 సంవత్సరాల నుంచి విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలు అందించడంలో గతంలో బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. చదువులు పూర్తయినా, సర్టిఫికెట్లు పొందాలంటే పెండింగ్ బకాయిలు చెల్లించి తమ సర్టిఫికెట్లను తీసుకువెళ్లాలని విద్యార్థులకు ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు చెప్పడంతో పేద విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఉన్నత చదువులు చదవాలంటే చదువులు సాగేలా లేదని అన్నారు. ఒకవైపు బెస్ట్ ఎవెలెబుల్ పాఠశాలలో అనుమతించక పోవడంతో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జగిత్యాలలో రోడ్డు ఎక్కిన వైనం ప్రభుత్వానికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ దీనిపై విద్యా సంస్థలకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కుషాల్, సుబోధ్, సంజయ్, కార్తీక్ పాల్గొన్నారు.

భవితకేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్సలు



భిక్కనూరు భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు నవీన్‌సాయి

భిక్కనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం వైద్యుడు నవీన్ సాయి దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వలన మా నసిక ఉపశమనం కలుగుతుందని అన్నారు. వీరిని క్రమం తప్పకుండా ప్రతి మంగళవారం, గురువారం ఫిజియోథెరపీ శిబిరానికి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ్ గంగారెడ్డి, పాఠశాల ఇంచార్జి హెచ్ఎం భవాని, ఐఆర్పీ మహేందర్, పీడీ నర్సింహారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలోని ఎర్రమన్నుకుచ్చకు చెందిన బోసు సుగుణ(23) అదృశ్యమైనట్లు పట్టణ సీఐ శ్రీధర్ గురువారం తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం దుస్తులు కుట్టించుకోవడానికి ఇంటి నుండి బయలుదేరింది. కాగా తిరిగి మళ్లీ రాలేదన్నారు. ఆమె కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద ఎక్కడా వెతికినా ఫలితం లేకపో వడంతో భర్త వెంకటి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సుగుణ ఇంటి నుంచి వెళ్లే సమయం లో పసుపు రంగు చీర, పసుపు రంగు జాకెట్ వెళ్లిందన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్ తెలియజేయాలని కోరారు.

ల్యాబ్.. డబ్బు..

(5వ పేజీ తరువాయి)

లింగంపేట్, ఎల్లారెడ్డి, మద్నూర్ తదితర మండల కేంద్రాల్లో అనుమతి లేకుండా ల్యాబ్‌లు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు.

అర్హులు లేనే లేరు...

డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయాలంటే అందుకు తగిన విద్యార్హత ఉండాలి. అయితే జిల్లాలో చాలా ల్యాబ్‌లలో కావాల్సిన సర్టిఫికెట్లు లేకుండానే ల్యాబ్‌లలో పరీక్షలు చేస్తున్నారు. రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కొన్ని రోజుల పాటు ఏదో ఒక ల్యాబ్‌లో పనిచేసి, ఇక తమకు అన్ని పరీక్షలు చేయడం వచ్చన్న ఉద్దేశ్యంతో సొంతంగా దుకాణాలు తెరుస్తున్నారు. దీంతో ల్యాబ్ నిర్వాహకులు ఇచ్చే రిపోర్టులపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ల్యాబ్ ఏర్పాటు కోసం సదరు వ్యక్తి డీఎంఎల్‌టీ కోర్సు పూర్తి చేయడంతో పాటు, ఎంబీబీఎస్ డాక్టర్ అందుబాటులో ఉండి, వైద్య ఆరోగ్య శాఖ అనుమతి తీసుకోవాలి. కానీ ఇవేమీ లేకుండానే ఇష్టానుసారంగా ల్యాబ్‌లు ఏర్పాటవుతున్నాయి.

ల్యాబ్ ఏర్పాటుకు ఇవి తప్పని సరి...

ల్యాబ్‌లలో బయో మెడికల్ వేస్ట్, ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్ ఫైర్ సిలిండర్ ఉండాలి. ల్యాబ్‌లో నిర్ధారణ పరీక్షల రుసుముల పట్టిక, సిబ్బంది వివరాలు, వినియోగిస్తున్న పరికరాల వివరాలు, టెక్నీషియన్ ధ్రువపత్రం ప్రదర్శించాలి. ఉపయోగించిన సూదులు గాని, గ్లౌస్‌లు, చెత్తను పారవేయడానికి విడివిడిగా చెత్త డబ్బాలు ఉంచాలి. ఈ చెత్తను జిల్లా కేంద్రం నుంచి వచ్చిన బయో వ్యర్థాలు సేకరించే వాహనంలోనే వేయాలి. బయట గాని, మనుషుల సంచారం ఉన్న ప్రాంతాల్లో వేస్టేజీని పారవేయరాదని నిబంధన పాటించాలి.

నేడు దోమకొండలో ర్యాలీ

దోమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 6:30 గంటలకు ర్యాలీని నిర్వహించనున్నట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. సంగమేశ్వర్ ఎక్స్‌రోడ్డు నుంచి సంగమేశ్వర్ వరకు పెద్దఎత్తున ర్యాలీ ఉంటుందన్నారు. మండలానికి చెందిన యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.

డయాలసిస్ సేవలు మెరుగుపర్చాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ పలువురు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు దృష్టికి గురువారం తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్‌కు ఫోన్ చేసి మాట్లాడి డయాలసిస్ సేవల గురించి ఆరా తీశారు. డయాలసిస్ సేవలు మెరుగుపర్చాలని, అర్హత కలిగిన టెక్నీషియన్‌తో సేవలు అందించాలని, రోగులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రి సేవల్లో ఇబ్బందులు కలగకుండా చూస్తామని సూపరింటెండెంట్ తెలిపారు.

పాఠశాల బస్సుల తనిఖీ

సుభాష్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని ప్రైవేట్ పాఠశాల బస్సులను గురువారం పోలీసులు, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు పాఠశాల బస్సులను, ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. తనిఖీల్లో భాగంగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నియామాలను ఉల్లంఘించిన వాహనాలపై కేసులు నమోదు చేసి డ్రైవర్‌లకు హెచ్చరికలు జారీ చేశారు.

ఆన్‌లైన్ ఓపెన్‌హౌస్

సుభాష్‌నగర్, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఫ్లాగ్‌డే సందర్భంగా గురువారం నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ ద్వారా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిసెప్షన్ కౌంటర్ ఏ విధంగా నిర్వహిస్తారో తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు, డయల్ 100 పనితీరు, పెట్రోకారు పనితీరు, నేరస్థుడిని పట్టుకున్న తర్వాత సమాచార సేకరణ, రికార్డుల నిర్వహణ, తదితర వివరాలను విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి	డ్యూడ్
వెంకటేశ్వర	కె- ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230